క్లుప్తంగా

పనులు వేగవంతం చేయండి



జొహరాపురం వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతం చేయాలని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. ఆదివారం స్థానిక జొహరాపురంలోని ఆశ్విని ఆసుపత్రి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లు, కల్వర్టులు, రిటైనింగ్ వాల్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా, జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ట్రైనీ ఏఈ రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇచ్చి ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్వామిరెడ్డి నగర్, బంగారుపేటలో ఏఐవైఎఫ్ శాఖల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలన్నింటికీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, గ్రూప్స్ పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. నాయకులు కృష్ణ, నాగరాజు, కుమార్, రాజశేఖర్, శివాజీ, విన్నీ, శ్రీనివాసులు, రాజ్‌కుమార్, బాట్జీ పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో కాంస్యం



ఆసియా పసిఫిక్ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన ప్రతాప్‌కుమార్

కర్నూలు (టౌన్): గత నెల 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు సింగపూర్‌లో నిర్వహించిన పసిఫిక్ షిటోర్యు కరాటే చాంపియన్‌షిప్‌లో కర్నూలుకు చెందిన కరాటే మాస్టర్ డాక్టర్ కోలా ప్రతాప్‌కుమార్ కాంస్య పతకం సాధించాడు.ఆయన మాట్లాడుతూ.. చాంపియన్‌షిప్ పోటీల్లో 29 దేశాలు పాల్గొన్నాయన్నారు. భారత్ నుంచి 40 మంది కరాటే మాస్టర్లు పాల్గొన్నగా ఆంధ్రప్రదేశ్ నుంచి తాను ప్రాతినిధ్యం వహించానన్నారు. 45 ఏళ్ల విభాగం వెటరన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని పతకం సాధించడంపై ఆయన్ను పలువురు క్రీడాభిమానులు అభినందించారు.

తైక్వాండో సాధనతో ధైర్యసాహసాలు

కర్నూలు(సెంట్రల్): తైక్వాండో సాధనతో ధైర్యసాహసాలు అలవడి జీవితంలో ఉన్నత మార్గంలో పయనిస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చంద్ర రాజేశ్వర రావు భవన్‌లో తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు కలర్ బెల్టుల ప్రధానోత్సవ కార్యక్రమం చేపట్టారు. గౌరు చరితారెడ్డి, మూడో పట్టణ సీఐ శేషయ్య ముఖ్య అతిథులు గా హాజరై విద్యార్థులకు కలర్ బెల్టులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం కార్పొరేట్ విద్యతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పిల్లలకు ఆటలు, పాటలు దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కరాటే, తైక్వాండో, ఇతర ఆటల్లో శిక్షణ ఇప్పించాల న్నారు. సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణ, తైక్వాండో శిక్షకుడు కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ :అమరన్, రోటి కపడా రొమాన్స్, జీబ్రా, భైరతి రణగల్, లక్కీ భాస్కర్, మెకానిక్ రాకీ
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ :కంగువ, అమరన్, రోటి కపడా రొమాన్స్, భైరతి రణగల్, ఇష్క్, ఉద్వేగం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ :లక్కీ భాస్కర్
భరత్ కాంప్లెక్స్ : ఉక్కు సత్యాగ్రహం, కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్)
రాజ్ : మెకానిక్ రాకీ
విజయ : భైరతి రణగల్
విక్టరీ టాకీస్ : అమరన్



కర్నూలు మెడికల్ కాలేజీ సమీపంలో ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న పాత పుస్తకాలు

రోడ్డున పడ్డావా నేస్తమా!

పుస్తకం హస్తభూషణం అనేవారు ఒకప్పుడు. కానీ ఇప్పుడు మొబైల్ ఫోన్ హస్తభూషణంగా మారింది. ఒకప్పుడు ఎవ్వరి చేతిలో చూసినా పుస్తకాలే ఉండేవి. మొబైల్ ఫోన్‌లు వచ్చాక పుస్తక పఠనం కూడా ఆన్‌లైన్ ద్వారానే జరిగిపోతోంది. దీంతో పుస్తకాలు కొని చదివేవారు అరుదైపోయారు. ఈ క్రమంలో అక్కడక్కడా ఉన్న పుస్తక దుకాణాలు కూడా మాయమయ్యాయి. ఒకప్పుడు దుకాణాల్లో కొనుగోలు చేసిన పుస్తకాలు అక్కడా.. ఇక్కడా చేతులు మారి పాతసామాన్లు విక్రయించే దుకాణాలకు చేరుతున్నాయి. వాటిని సేకరించి తిరిగి ఇలా ఫుట్‌పాత్‌లపై పాత పుస్తకాల రూపేణా విక్రయిస్తున్నారు. వీటిలో అరుదైన పుస్తకాలు లభిస్తుండటంతో ఔత్సాహికులు ఆసక్తిగా కొని ఇంటికి తీసుకెళుతున్నారు. – కర్నూలు(హాస్పిటల్)

ఆదివారమైనా.. విధులకు రావాల్సిందే!



ఆదివారం చంటిపాపతో విధులకు హాజరైన డీటీ దీపిక

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వంలో అధికారులు పని భారంతో అల్లాడిపోతున్నారు. ఆడ, మగ అన్న తేడా లేకుండా రాత్రి 8–9 గంటల వరకు పని చేయిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెలవురోజైన ఆదివారం పని తప్పుతుందనుకుంటే అదీ లేదు. కలెక్టరేట్‌లోని ఈ–సెక్షన్‌లో పలువురు ఉద్యోగులు ఆదివారం విధులకు హాజరయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ హోదాలో పనిచేస్తున్న దీపిక చిన్న పాపతో డ్యూటీకి వచ్చారు. మధ్యాహ్నం పాప ఆకలితో అల్లాడుతూ ఇంటికి పోదామని మారం చేస్తున్నా ఆమె ఏమీ చెప్పలేకపోయింది. పాపకు లాలీపాప్ అందించి శాంతింపజేసింది. ఆమె మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కడే ఉండి భోజన విరామానికి వెళ్లాల్సి రావడంతో పాప ఆకలితో అల్లాడిపోయింది.

ఉపాధి కల్పించే వరకు పోరాటం



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): పట్టణ ప్రాంతాల్లో పరిశ్రమలు – ఉపాధి కోసం ఉద్యమిద్దామని సీపీఎం న్యూసిటీ నగర కమిటీ నిర్ణయించింది. ఆదివారం కేకే భవన్ సమీపంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో సీపీఎం కర్నూలు న్యూసిటీ నగర కమిటీ మూడో మహాసభలను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి ప్రారంభించారు. ముందుగా మహాసభ ప్రారంభ సూచికగా సీపీఎం పతాకాన్ని న్యూసిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ సాయిబాబా ఎగురవేశారు. అనంతరం నాయకులు ఆర్.నరసింహులు, కె.అరుణమ్మ, శంకర్‌ల అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి, పి.నిర్మల, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ.. రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు నగరంలో యువతకు ఉపాధి కరువైందన్నారు. ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడే పరిశ్రమలు ఏర్పాటు చేసే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న టీజీ భరత్ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలని కోరారు. కర్నూలు నగరం వేగంగా విస్తరిస్తున్నా శివారు కాలనీల్లో కనీస మౌలిక సదుపాయలు లేవన్నారు. ముఖ్యంగా కాలువలు, రోడ్లు, మంచినీటి సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. న్యూసిటీ కమిటీ నగర కార్యదర్శి టి.రాముడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

మందుబాబులపై డ్రోన్ నిఘా

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో 18 ఓపెన్ లిక్కర్ డ్రింకింగ్ కేసులు నమోదయ్యాయి. నగరంలో పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచారు. డీఎస్పీ జె.బాబుప్రసాద్ ఆధ్వర్యంలో నేర నియంత్రణ చర్యల్లో భాగంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నాలుగవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, డీ మార్టు వెనుక వైపు ఉన్న సమస్యాత్మక ప్రదేశాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరా ద్వారా నిఘా చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 18 మందిని ట్రాఫిక్ పోలీసులు, నాలుగవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఇకపై నిరంతరం నిఘా ఉంటుందని పోలీసులు వెల్లడించారు. కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, కర్నూలు నాలుగవ పట్టణ ఎస్ఐ గోపీనాథ్, ట్రాఫిక్ ఏఎస్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యానికి మూలమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. భగవాన్ శ్రీ ధన్వంతరి జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఆరోగ్యభారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో స్థానిక వెంకటరమణ కాలనిలోని శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో కుటుంబ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాలు, వాతావరణ స్థితులను బట్టి మన పూర్వీకులు మనకు అందించిన ఆహారమే మన ఆరోగ్యానికి మూలమని చెప్పారు. అనంతరం ఉత్తమ వైద్యసేవలు అందించిన చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ సీఏ.నగేష్, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జీవి. రమణారెడ్డి, హోమియో వైద్యులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ వసంతలక్ష్మిలను సన్మానించారు. ఆ తర్వాత చిరుధాన్యాలతో ఆరోగ్య భోజనం ఎలా తయారు చేయాలో వివరించి, వంటకాలు తయారు చేసి వడ్డించారు. ఆంధ్రప్రదేశ్ కుటుంబ ప్రభోధన ప్రాంత ప్రముఖ్ పుట్టా శేషు, ఆరోగ్యభారతి రాష్ట్ర కార్యదర్శి ఎండీవీఎస్.రామశర్మ, జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి.మోక్షేశ్వరుడు, జిల్లా కార్యదర్శి డాక్టర్ బి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో యువత భాగస్వామ్యం కీలకమని రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ నుంచి బి.తాండ్రపాడు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఇన్‌చార్జ్ వీసీ ప్రారంభించి మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిని నయం చేయడానికి పూర్తిస్థాయిలో వైద్యం అందుబాటులో లేదని, ఎయిడ్స్ సోకకుండా నివారించడమే మొదటి ప్రాధాన్యత కావాలన్నారు. ప్రస్తుతం ఉన్న మందులతో రోగి జీవిత కాలాన్ని పెంచగలమన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ విస్తరణ అరికట్టవచ్చన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ పి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ విద్యార్థులు, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివా రం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే చర్చ, పోస్టర్ ప్రదర్శన, పెయింటింగ్, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సి పాల్ జె.హేమంత్ పాల్గొని ప్రసంగించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ బి.సుజాత, సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ విద్యార్థులు

- సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీకి చెందిన రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఎల్లా కృష్ణ ప్రసంగించారు.
- బిక్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సింధూరార్చన



హోమంలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో లోక కల్యాణార్థం అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీహోమం తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో అమావాస్యను పురస్కరించుకొని శ్రీపంచముఖ ఆంజనేయ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూరార్చన, పల్లకీసేవ, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 27 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, మహా అన్న ప్రసాదం వితరణ కార్యక్రమాలు జరిగాయి. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం సందేశమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు.

మధ్యప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం

- ఐదుగురు మృతి, ఒకరికి గాయాలు
- మృతుల్లో కర్నూలుకు చెందిన అంబులెన్స్ డ్రైవర్

కర్నూలు(హాస్పిటల్): మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ షేక్‌బాబు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బీహార్‌లోని చంపారన్‌కు చెందిన అనిష్‌షా (18) కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు స్వస్థలానికి వెళ్లేందుకు స్థానికంగా ఉన్న అంబులెన్స్‌ను మాట్లాడుకుని అదేరోజు బయలుదేరారు. అంబులెన్స్ ఆదివారం ఉదయం మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో పాద చారుడిపైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడి అనంతరం పక్కనే ఉన్న గుంతలో పడింది. ప్రమాదంలో అంబులెన్స్‌లో వెళ్తున్న ప్రమితషా (35), ప్రిన్సిషా (4), ముకేష్‌షా (36), సునీల్‌షా (40)తో పాటు కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ షేక్ బాబు మరణించారు. మరో డ్రైవర్‌గా వెళ్లిన ప్రసాద్ తీవ్రంగా గాయపడటంతో జబల్‌పూర్ ఆసుపత్రికి తరలించారు.

టైలరింగ్ పరీక్షకు ఫీజు రాయితీ

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టైలరింగ్, ఎంబ్రాయిడరీ దిగువ శ్రేణి పరీక్ష రాయాలనుకునే ముస్లిం మైనారిటీ అభ్యర్థులు, పాత్రికేయ కుటుంబ సభ్యులకు ఫీజును (మొత్తం 10 మందికి) తమ సంస్థ చెల్లిస్తుందని నగరంలోని జాగృతి కంప్యూటర్, టైలరింగ్, షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇసాక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇరవై కంటే ఎక్కువ మంది పరీక్షకు హాజరు కావాలనుకుంటే ఫీజు రూ.200లను చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉచితంగా పరీక్ష మెలకువలను నేర్పించడం జరుగుతుందని, పరీక్ష రాయాలనుకున్న వారు ఈ నెల 5వ తేదీలోగా సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9963377579 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

కర్నూలు (టౌన్): బాలికలకు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు రక్షణ కవచంగా నిలుస్తాయని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో తైక్వాండో శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు ఆయన బ్యాగులు, మంకీ క్యాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలపై దాడులు, అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ప్రతి బాలికకు అవసరమన్నారు. తల్లిదండ్రులు ఆత్మరక్షణ క్రీడల వైపు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు.

రైల్వే వ్యాగన్ పరిశ్రమను పూర్తిచేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు రైల్వే వ్యాగన్ పరిశ్రమ నిర్మాణాన్ని పూర్తిచేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, వై.నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో కర్నూలు మండల డీవైఎఫ్ఐ జనరల్ బాడీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. కర్నూలు మండలం పంచలింగాల సమీపంలోని రైల్వే వ్యాగన్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని, పను లు ప్రారంభమై 10 సంవత్సరాలు గడిచినా పూర్తి కాకపోవడం విచాకరమన్నారు. మండల కార్యదర్శి ప్రకాష్, నాయకులు సురేష్, హరికిషన్‌రెడ్డి, శంకర్, దివాకర్, నాగప్ప, రాజు పాల్గొన్నారు.

వసతి గృహానికి ఫ్యాన్ల విరాళం

కర్నూలు(హాస్పిటల్): కలెక్టరేట్ పక్కన ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహానికి రుమటాలజిస్టు డాక్టర్ సృజన ఐదు ఫ్యాన్లను విరాళంగా అందజేశారు. ఆదివారం వీటిని హాస్టల్ వార్డెన్ సుమలత అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ప్రభుత్వ బాలికల వసతి గృహానికి తన వంతు సాయం చేస్తున్నట్లు తెలిపారు. స్తోమత ఉన్న ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు.

నేడు వలంటీర్ల ధర్నా

కర్నూలు(సెంట్రల్): వలంటీర్లను కొనసాగించి రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ సోమవారం గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుమాయూన్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నామని, భారీగా వలంటీర్లు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు





ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్ సుభద్ర మూర్తులు, హరే కృష్ణ సంకీర్తన చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరీథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు జరిగాయి. శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. రఘునందన సేవక ప్రభు భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. మానవ సంబంధాలు, ఉన్నత జీవనం సాగించేందుకు ఉపయోగపడే అన్ని అంశాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు. గీత పఠనం, శ్రవణంతో జీవనయానంలో మార్పు తెస్తుందన్నారు. ఉత్పన్నమయ్యే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతోనే డయాబెటీస్ నియంత్రణ



డాక్టర్ భవానీప్రసాద్‌ను సన్మానిస్తున్న డాక్టర్ పి.చంద్రశేఖర్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలిలో మార్పులు చేసుకుంటే డయాబెటీస్ నియంత్రణలో ఉంటుందని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భవానీప్రసాద్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఏ క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో డయాబెటీస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రస్తుతం డయాబెటీస్ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. సమాజంలో 15 నుంచి 20 శాతం మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. జీవనశైలిలో మార్పులు, ఆహారంలో ఎక్కువగా తెల్లబియ్యం, మైదా, చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలు తీసుకోవడంతో పాటు మానసిక ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం కారణంగా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. గతంతో పోలిస్తే షుగర్ వ్యాధి నియంత్రణకు ప్రస్తుతం అనేక ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. అయినా జీవనశైలిలో మార్పులు చేసుకోకపోతే వ్యాధి నియంత్రణలోకి రాదన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, మితాహారం తీసుకోవడం, ఆహారంలో స్వీట్లు, తెల్ల అన్నం, కొవ్వు పదార్థాలు తగ్గించాలని, ప్రశాంతతకు యోగా, ధ్యానం చేయడం చేయాలన్నారు. అనంతరం ఆయన్ను హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, సభ్యులు సన్మానించారు.

తలసీమియా బాధితులకు రక్తదానం



రక్తదాతను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కర్నూలు కేఫ్ ముక్కమల్ల మురళీమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 60 మంది పాల్గొని రక్తదానం చేశారు. వీరిని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి అభినందించారు. తలసీమియా, హెచ్‌ఐవీ బాధితులకు, డయాలసిస్ రోగులకు నిరంతరం రక్తం అవసరం అవుతుందని, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సమయానికి రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. రోపా అధ్యక్షులు చింతలపల్లి రామకృష్ణ, రెడ్‌క్రాస్ సభ్యులు శ్రీనివాసులు, నిర్వాహకులు శోభన్‌బాబు, కోనేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను తోడేస్తున్నారు!





తుంగభద్ర నది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం


- ఉచితం పేరుతో అక్రమ వ్యాపారం
- తుంగభద్ర నది నుంచి ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు
- కన్నెత్తి చూడని అధికారులు

కర్నూలు(రూరల్): తుంగభద్ర నది ఇసుక అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. జిల్లా కేంద్రం కర్నూలు సమీపానున్న ఈ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా అడిగేదిక్కులేరు. రాత్రి, పగలు తేడాలేకుండా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి మండల పరిధిలోని మునగాలపాడు, మామిదాలపాడు, నిడ్జూరు, జి.సింగావరం, పంచాలింగాల, ఈ.తాండ్రపాడు, గొందిపర్ల, దేవమాడ, పూడురు గ్రామాల సరిహద్దున తుంగాభద్ర నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరిస్తున్నారు. ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. వెంచర్లతో పాటు గృహ నిర్మాణలకు ఇసుక సరఫరా చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ట్రాక్టర్ ఇసుకు రూ. 3 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. వంతెనల సామీపాన ఇసుక తరలింపు నిషేధమైనా ఎవరికీ పట్టడం లేదు. మునగాలపాడు గ్రామ వంతెన సమీపాన ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వుతున్నా అడిగే నాథుడు కరువయ్యారు.

అధికారపార్టీ నేతల అండదండలతో....

ఉచిత ఇసుక విధానం ఓ విధంగా అధికారపార్టీ నేతలకు కలిసొచ్చింది. అనుచరులకు ఆదాయ వనరుగా మారింది. వాస్తవానికి ఉచిత ఇసుక తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నియమనిబంధనలు విధించింది. సొంత నిర్మాణాలకే ఇసుకను ఉచితంగా తీసుకెళ్లాల్సి ఉంది. అదికూడా గ్రామ సచివాలయల్లో పంచాయతీ సెక్రటరీ అనుమతి తప్పనిసరి. కూటమి నేతల అండదండలతో అనుచరులు ఇష్టారాజ్యంగా తుంగభద్ర నది ఇసుకను తోడేస్తున్నారు. ఇంకొందరు అక్రమార్కులు అధికారపార్టీ నేతల అండదండలతో ఏకంగా ఇసుక డంప్‌లు ఏర్పాటు చేశారనే విమర్శలు లేకపోలేదు. గత నెలలో ఓ గ్రామంలో ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు గుర్తించిన తీరు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ ఇసుక రవాణాలను అరికట్టాలన ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఉచిత ఇసుకకు అనుమతి తప్పనిసరి



గృహ నిర్మాణాలకు సంబంధించి ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు పంచాయతీ సెక్రటరీ అనుమతి తప్పనిసరి. సెక్రటరీ అంగీకార ధ్రువ పత్రం ఉంటేనే ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తెలిసిస్తే ఎంతటివారైనా ఉపేక్షించం. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– తహసీల్దార్, టీవీ రమేష్ బాబు